క్లుప్తంగా

కూరగాయల ధరలు



శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 30, పచ్చి మిర్చి 50 , బెండ 40, కాకర 40, దొండ 40, దోస 60, ఆలు 25, చామ 45, కీర 30, బీర 40, వంకాయ 35, గోకర 45, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 60, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 200, వెల్లుల్లి 200.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్స్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవడానికి ఆఖరు తేదీగా ఈనెల 31ని నిర్ధారించినట్లు 'మనూ'అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ మంగళవారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే సమర్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో సర్టిఫికెట్, డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ క్యాంపస్‌లో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో సర్టిఫికెట్ డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఉంటాయని, లక్నో క్యాంపస్‌లో ఫ్యాషన్ టెక్నాలజీలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు అందించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారాలు, సాధారణ సూచనలు, ఇతర వివరాలు అన్నింటినీ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.manuu.edu.inలో అందుబాటులో ఉంచామన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

రాయదుర్గం: ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్‌వీఎం కృష్ణారావు కుటుంబాన్ని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. అంతకు ముందు గోపన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీలోని కృష్ణారావు ఇంట్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గజ్జలయోగానంద్, గోవర్ధన్‌గౌడ్, నాగేశ్వర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, శాంతి భూషణ్‌రెడ్డి, రాఘవేందర్‌రావు, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

మహ్మద్ ఆరీఫ్‌కు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ డిగ్రీని మంగళవారం ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఉర్దూ విభాగంలో పరిశోధక విద్యార్థి మహ్మద్ ఆరీఫ్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అహ్మద్‌ఖాన్, ఉర్దూ విభాగం మాజీ విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ ఫరూఖ్‌బక్షి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆయన 'ఆజాదీ కే బాద్ ఉర్దూ మే తవీల్ నజ్మ్ నిగరీ కా తంఖీదీ తజ్జియా'అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో వైవా నిర్వహించి ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

సీతారెడ్డిని కలిసిన కార్పొరేటర్



హఫీజ్‌పేట్: టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమితులైన చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీతారెడ్డిని మంగళవారం చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను కలిసిన వారిలో డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి ఉన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని మల్లికార్జుననగర్, ఇక్రిసెట్ కాలనీలలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: శేరిలింగంపల్లిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో గోపన్‌పల్లి, ఎన్టీఆర్‌కాలనీ, ఫాకాలనీ, గోపన్‌పల్లి వీకర్ సెక్షన్ కాలనీ, ఖాజాగూడలో కోటిన్నర రూపాయలతో ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో చేపట్టే పనులకు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో శేరిలింగంపల్లికి పెద్ద ఎత్తున, గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు మంజూరయ్యాయని గుర్తుచేశారు. శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దుతూ అగ్రగామిగా తయారు చేశామన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో యూజీడీ, సీసీరోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, రోడ్ల విస్తరణ, లింకురోడ్లు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల వంటివి నిర్మాణం చేశామన్నారు. అంతేకాకుండా ప్రస్తుతం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగ్గా చేయడానికి చర్యలు చేపట్టామని, అందులో భాగంగా నాలాల విస్తరణ, వరద నీటి కాలువల నిర్మాణం, మురుగుకాలువల పనులను చేపట్టామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేయాలనే తపనతో అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సోఫాకాలనీలో రూ.48 లక్షలతో యూజీడీ, ఎన్టీఆర్‌కాలనీలో రూ.52 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం, గోపన్‌పల్లి వీకర్ సెక్షన్‌లో రూ.20 లక్షలతో, ఖాజాగూడలో రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఈఆర్‌సీ ఏఈ చందు, నాయకులు గణేష్‌ముదిరాజ్, రాజునాయక్, చెన్నంరాజు, సత్యనారాయణ, సురేందర్, జంగయ్యయాదవ్, నరేష్, రాజుముదిరాజ్, అక్బర్, రమేష్‌గౌడ్, నారాయణ, నవాజ్, అనీల్‌సింగ్, రామేశ్వరమ్మ, సుగుణ, బాలమణి, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.



క్రీడాకారిణికి చేయూత

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా రహేజా కార్ప్ గ్రూప్ కంపెనీ ఇనార్బిట్ మాల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, నిర్మాణ్ సంస్థతో కలిసి నిరుపేద క్రీడాకారులకు చేయూతని అందించే 'ధనుష్ శక్తి'ప్రారంభించింది. ఈ సందర్భంగా ఇనార్బిట్ మాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. యువ ఆర్చర్ తానిపర్తి చికిత పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన సామగ్రితో పాటు అన్నిరకాల తోడ్పాటు అందించనున్నట్టు తెలిపారు. పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత ప్రస్తుతం సీనియర్ ఇంటర్ విద్యార్థిని అని, సబ్-జూనియర్ నేషనల్ గేమ్స్‌లో రజత, కాంస్య పతకాలను సాధించి ఈ ఏడాది అక్టోబర్‌లో థాయిలాండ్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతోందని వివరించారు. సమావేశంలో క్రీడాకారిణి చికితతో పాటు శ్రవణ్ కుమార్ గోనె,శరత్ బెలవాడి, మయూర్ పట్నాల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి



రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి ఎల్లమ్మబండ మీదుగా గాజులరామారం పోయే రోడ్డు మధ్యలో డివైడర్‌ను రోడ్డు విస్తరణ పనులు చేయకుండానే ఏర్పాటు చేయడానికి నిరసిస్తూ మంగళవారం బీజేపీ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డితో కలిసి బీజేవైం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ మాట్లాడారు. గాజులరామారం నుంచి ఎల్లమ్మబండ వరకు రోడ్డును వెంటనే విస్తరణ చేయాలన్నారు. అలాగే రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలను వెంటనే తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు. కేటీఆర్ కాలనీ, జయశంకర్‌కాలనీల వద్ద రోడ్డు ఇళ్ల వైపు పెరగకుండా ఖాళీ స్థలం వైపు పెంచి డివైడర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి ఎల్లమ్మబండ వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలన్నారు. తులసీవనం అపార్టుమెంట్ ముందు ట్రాఫిక్ చలాన్ల బెడద లేకుండా వాహనదారులకు ఉపశమని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎత్తరి రమేష్, రాజు, రఘు, చారి, రమేష్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన మహిళ కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: హత్యకు గురైన మహిళ కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ప్రత్యేక చొరవతో అందించేలా చేశారు. కేశవనగర్‌లో నివాసముండే కాశమ్మ దారుణంగా హత్యకు గురైంది, ఈ నేపథ్యంలో వారు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబసభ్యులతో మాట్లాడి, పేద కుటుంబం కావడంతో వారికి నష్టం పరిహారం ఇవ్వాలని నిర్మాణ సంస్థ వారితో మాట్లాడి వారిని ఒప్పించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. హత్యకు గురైన మహిళకు ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు. భవిష్యత్‌లో వారి కుటుంబానికి, పిల్లలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేయాల్సిన అవసరం ఉందన్నారు.

యువతి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల పరకారం. ఇస్నాపూర్ ఇంద్రమ్మ కాలనీకి చెందిన అఖిల(19) సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె సోదరుడు మహేష్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రాంతంలో బాలిక..

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ బాలిక(17) రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి 9 గంటలకు పడుకుంది. రాత్రి 11 గంటలకు చూడగా ఇంటిలో బాలిక కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో చెరువులో పడి మహిళ మృతి

మియాపూర్: అనుమానాస్పద స్థితిలో చెరువులో పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్ మాతృశ్రీనగర్ కాలనీలోని వీధికుంట చెరువులో ఓ మహిళ మృతదేహం ఉందని మంగళవారం సాయంత్రం మియాపూర్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మహిళను బయటికి తీసి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మహిళ గురించి స్థానికులకు ఆరాతీయగా హఫీజ్‌పేటలో నివాసముంటున్న మంజుల(35)గా గుర్తించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ మల్లికార్జుపల్లికి చెందిన మంజుల భర్త రాజు కుమారుడు సతీష్, సాయికుమార్‌తో కలిసి హఫీజ్‌పేటలో నివాసముంటున్నారు. రాజు ఇస్త్రీ పనిచేస్తుండగా మంజుల స్థానికంగా ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మంజుల సోమవారం సాయంత్రం పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అప్పటి నుంచి మంజుల కనబడటం లేదని భర్త రాజు, కుటుంబసభ్యులు చుట్టుపక్కల బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. మియాపూర్ పోలీసులు మంగళవారం సాయంత్రం మంజుల వీధికుంట చెరువులో పడి మృతి చెందిందని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బోయిన్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైదరాబాద్ చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్ర ప్రసాద్ నాయక్‌ను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లిలోని రోడ్డు వెడల్పు పనులు గురించి చర్చించారు. ఈ పనులు త్వరగా పూర్తి చేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు ఉన్నాయని వారికి నష్టపరిహారం త్వరగా అందించేటట్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అందరికీ న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

కార్పొరేటర్ పాదయాత్ర

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో 90శాతం పనులు పూర్తయ్యాయని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. పాదయాత్రలో భాగంగా మంగళవారం ఆయన ధరణినగర్, పాపమ్మ కాలనీ, చంద్రమ్మ నగర్, పంచమి కాలనీ, హనుమాన్ నగర్ కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంత మేర పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో బీజేపీ పార్టీకి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ మేడ్చల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు జక్కుల రాజు, కూకట్‌పల్లి డివిజన్ కార్యదర్శి సాయి కిరణ్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నామని తెలిపారు. మంగళవారం వీరికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్టు విష్ణులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి జీఏకే కృష్ణ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. రెండు నెలల 15 రోజులకు హుండీ ఆదాయం 1,04,809 రూపాయలు వచ్చిందన్నారు. అదే విధంగా మోతీనగర్, హైమావతినగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆరు నెలలకు 2 లక్షల 8 వేల 424 రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు.

నవజాత శిశువుల సంరక్షణకు అంబులెన్స్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: నవజాత శిశువుల సంరక్షణకు అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో నవజాత శిశువుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. పుట్టిన శిశువు నుంచి 40 రోజులు శిశువు సంక్షణ కోసం అంబులెన్స్(108)లో ఆక్సిజన్, ఇంక్యుబెటర్‌తో పాటు అత్యాధునికి సౌకర్యాలున్నాయని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో నిలోఫర్, నిమ్స్ ఆస్పత్రులకు తరలించవచ్చన్నారు. జిల్లాకో అంబులెన్స్ కేటాయించారని, రంగారెడ్డి జిల్లా కోటలో కొండాపూర్ ఆస్పత్రికి అంబులెన్స్ కేటాయించారని వివరించారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ జిల్లా ఆస్పత్రి డాక్టర్ మూర్తి, బీఆర్ఎస్ నాయకులు ఊట్ల కృష్ణ, జంగంగౌడ్, బలరాం, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

బస్తీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా



స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, బస్తీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్, హెచ్ఏజీ, వైశాలినగర్ కాలనీల్లో బీజేపీ పార్టీ గడపగడపకూ రవన్న ప్రజాయాత్ర ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యిందన్నారు. రూ.8వేల కోట్లతో అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. బీజేపీ నాయకులు శ్రీధర్, కోటేశ్వరరావు, రవి గౌడ్, బాబురెడ్డి, పృథ్వీ, యాదగిరి, జగన్, ఆకుల లక్ష్మణ్, రామకృష్ణ, కృష్ణంరాజు, రాజు, శివా, ముఖేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు



కళ్ల అద్దాలను అందజేస్తున్న భిక్షపతి యాదవ్

హఫీజ్‌పేట్: సామాజిక సేవ చేయడం సంతృప్తిని కలిగిస్తుందని మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ పేర్కొన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల సౌలభ్యం కోసం ఉచితంగా కంటీ పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను, ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. లాభాపేక్ష లేకుండా, రాజకీయాలకతీతంగా సమాజానికి సేవ చేయాలనే మానవతా దృక్పథంతో నెలకొల్పబడ్డ ట్రస్ట్ సేవలు నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులు భిక్షపతి యాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్, దేవాల్ యాదవ్, అనంతరెడ్డి, రాజేష్, రాజ్‌కుమార్, బాలరాజ్, రమణయ్య, రాజు యాదవ్ శేఖర్, రాజేష్, శ్రీనివాస్ యాదవ్, కౌశిక్ పాల్గొన్నారు.

వైభవంగా ఫలహార బండి ఊరేగింపు



ఊరేగింపుల్లో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో శ్రావణ మాస బోనాల వేడుకల్లో భాగంగా ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో, బాపూనగర్ కాలనీల్లో నిర్వహించిన ఫలహార బండి వేడుకలకు కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పోతరాజుల వేషధారణలు ఊరేగింపునకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు గడ్డం రవి యాదవ్, బాపూనగర్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, అనిరుద్‌యాదవ్, కృష్ణయాదవ్, కిషోర్ యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, రాజేష్, హనుమాన్ యూత్ ప్రతినిధులు మహేష్‌చారి, ప్రభాకర్, శంకర్‌రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు

మణికొండ: రాష్ట్ర భూగర్భ వనరులు, సమాచారశాఖ మంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన మంత్రి మహేందర్‌రెడ్డికి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు చెందిన కౌన్సిలర్లు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో కలిసి మంత్రి పదవిని అధిరోహించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ నాయకుడు సునీల్‌కుమార్

మూసాపేట: మూసాపేటలోని ప్రగతినగర్ కమిటీ హాల్‌లో మంగళవారం ఎన్ఎస్‌యూఐ యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు నియోజకవర్గంలో బూత్‌స్థాయిలో నాయకులు ఉన్నారన్నారు. వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మరికొద్ది రోజుల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ పెడతామన్నారు.

◆ కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిస్బా, జిల్లా కార్యదర్శి రాహుల్ సింగ్, కూకట్‌పల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు జహంగీర్, పల్లపు వేణు, బాల్‌రాజ్, సచిన్, గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



మాట్లాడుతున్న హెచ్‌సీయూ ప్రొఫెసర్ విజయలక్ష్మి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

గచ్చిబౌలి: తెలుగు అంటే కేవలం కావ్యభాషను నేర్చుకోవడం కాదని, ఒక సామాజిక అవసరమని చాటి చెప్పింది గిడుగు రామ్మూర్తి అని హెచ్‌సీయూ ప్రొఫెసర్ దేవారెడ్డి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో కొత్తగూడ, సఫారీనగర్‌లోని న్యూబ్లూమ్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలుగులో మొదటి భాషా శాస్త్రకారుడని, తెలుగు వాడుక భాషా ఉద్యమానికి పితామహుడని పేర్కొన్నారు. తెలుగు సమాజం ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడమే ఆయనకు నిజమైన నివాళి అని గుర్తు చేశారు. తన జీవిత కాలంలో సగం రాజులు తెలుగు వాడుకభాషను గౌరవించాల్సిన అవసరాన్ని చారిత్రక, సాంఘిక కోణాలలో పరిశీలించి వివరించారు. అన్ని రంగాల్లో తెలుగు భాషను వినియోగించాలనుకునే ఆధునిక యుగంలో తెలుగు భాష అంటే కావ్యాలను చదవటం కోసం అనే అర్థం పోవాలని పదేపదే తమ ఉపన్యాసాలలో ఉద్బోధించారన్నారు. మారుతున్న సమాజానికి అవసరమైన భావజాలాన్ని సమకూర్చుకోవటానికి ఆధునిక వ్యావహారిక భాషను ప్రమాణీకరించుకుంటూ ముందుకు పోవాలన్న సూచనలు ఎన్నో చేశారని గుర్తు చేశారు. అనంతరం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రొఫెసర్ విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెనరీధర్ పాఠశాలలో..

మియాపూర్: మదినాగూడలోని కెనరీధర్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రాంమూర్తి జయంతి సందర్భంగా పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పాటలు, గేయాలు అందరిని అలరించాయి. ప్రిన్సిపాల్ లిడియా క్రిస్టీనా విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేశారు.